క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్, బ్రేకర్ ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎస్‌ఈ జాడె ఉత్తమ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ర్యాలీ, గఢ్‌పూర్ సబ్‌స్టేషన్‌లలో నూతనంగా ఏర్పాటు చేసిన 3.15ఎంవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, బ్రేకర్‌ను ఆదివారం విద్యుత్ ఎస్‌ఈ ఉత్తమ్ ప్రారంభించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, బ్రేకర్ల ఏర్పా టు ద్వారా ర్యాలీ, గఢ్‌పూర్ సబ్‌స్టేషన్‌ల పరి ధిలో వచ్చే గ్రామాల్లోని వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుదని తెలిపారు. కార్యక్రమంలో డీఈ కైసర్, ఏడీఈ వెంకటేశ్వర్లు, ఎంఆర్‌టీ ఏఈ శరత్‌కుమార్, ఏఈ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు



సంబురాల్లో వైద్యులు, మహిళలు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని బర్త్ రూట్ ఆసుపత్రి వైద్యులు శృతి గోలి, కృష్ణ చైతన్య దంపతుల ఆధ్వర్యంలో సామూహిక బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ బతుకమ్మ ఉత్సవంలో ఆసుపత్రి యాజమాన్యం, లక్ష్మీ బాలాజీ నగర్ మహిళలు, చుట్టుపక్కల మహిళలు అంతా పాల్గొని భక్తి శ్రద్ధలతో పాటలు పాడుతూ సంబురాలు చేసుకున్నారు. అనంతరం అల్పాహారం పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో వైద్యులు అవనిజ, ఈశ్వర్, పిల్లల వైద్యులు నరేష్, శ్రీధర్, న్యాయవాది గోలి తిరుపతి పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

భీమిని: మండలంలోని రాజారాం శివారులో కోడిపందేల స్థావరంపై ఎస్సై విజయ్‌కుమార్ సిబ్బందితో కలిసి ఆదివారం దాడి చేశారు. పక్కా సమాచారంతో దాడి చేసి ముగ్గురిని అదుపులో తీసుకున్నారు. రెండు కోడి పుంజులు, రూ.1600 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దాడిలో పోలీస్ సిబ్బంది ప్రవీణ్‌కుమార్, వినోద్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కళలను రక్షించుకుందాం

జన్నారం: పెరుగుతున్న టెక్నాలజీ కారణంగా యక్షగానం, నాటకాల లాంటి కళలు అంతరించి పోకుండా రక్షించుకోవాల్సిన అవసరం ఉందని శ్రీ రాజరాజేశ్వర భజన మండలి జిల్లా అధ్యక్షుడు దురంశెట్టి వెంకటచారి, ప్రధాన కార్యదర్శి వెంకటచారి పేర్కొన్నారు. మండలంలోని ఇందన్‌పల్లి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం భజన, నాటక రంగ, యక్షగాన కళాకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్వం యక్షగాణ, వీధి నాటకాల ద్వారా కళా ప్రదర్శనకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఇప్పుడు పెరుగుతున్న ఇంటర్‌నెట్, టీవీలతో కళలు కనుమరుగు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కళలను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం మండల నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా కొత్తపెల్లి ఆంజనేయులు, గౌరవ అధ్యక్షులుగా లచ్చయ్య, రామన్న, ఉపాధ్యక్షులుగా మూల నారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కండ్లె తిరుపతి, సలహా దారులుగా పాపగౌడ్ నియామకమయ్యారు.

వెల్గనూర్‌లో 3కే రన్..

దండేపల్లి: డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా మండలంలోని వెల్గనూర్ గ్రామంలో ×టీమ్ యూత్ స్పిరిట్× ఆధ్వర్యంలో ఆదివారం 3కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సదస్సులో డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాల గురించి యూత్ సభ్యులు అవగాహన కల్పించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు.

అలరించిన ఆత్మీయ సమ్మేళనాలు

శ్రీరాంపూర్‌లోని సాందీపని హైస్కూల్ విద్యార్థులు



దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల 2007-08 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



దండేపల్లి భారతీ విద్యానికేతన్ విద్యార్థుల సమ్మేళనం



శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని సాందీపని హైస్కూల్‌లో 2000–01లో టెన్త్ పూర్తిచేసిన విద్యార్థులు 25ఏళ్ల తర్వాత మొదటిసారిగా ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. నస్పూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన ఈ సమ్మేళనంలో ముందుగా నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులు ఈ సందర్భంగా నాటి తరగతిగదిలో జరిగిన తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆట పాటలతో అలరించారు. ఈ పాఠశాల కరస్పాండెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణి, ఉపాధ్యాయులు రేగళ్ల ఉపేందర్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లిక్, ముస్కే మల్లేశ్, పూర్వ విద్యార్థులు కే తిరుపతి, సురేశ్, మధూకర్, రమేశ్, సాగర్‌లు పాల్గొన్నారు.
దండేపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2007–08వదో తరగతి బ్యాచ్ విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్ననాటి మిత్రులందరూ ఒకే చోట కలుసుకొని, తమ తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మండల కేంద్రంలోని భారతీ విద్యానికేతన్ పాఠశాల 2006–07 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు అదే పాఠశాలను వేదికగా చేసుకొని పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని జరుపుకున్నారు. చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి సన్మానించారు.

పార్ట్‌టైం ఉద్యోగులు పస్తులేనా?

- మూడు నెలలుగా అందని వేతనాలు
- నిరీక్షిస్తున్న సాంఘిక సంక్షేమ పాఠశాలల ఉద్యోగులు

వీరంతా తాత్కాలిక భృతిపై విద్యార్థులకు పాఠాలు చెప్పే పంతుళ్లు. నెలనెలా ఠంచన్‌గా వేతనాలు వేస్తేనే ఇల్లు గడిచే ఉపాధ్యాయులకు మూడు నెలల నుంచి వేతనాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. బతుకమ్మ, దసరా పండుగలను పిల్లా పాపలతో సంతోషంగా గడపాలని ఆశించిన పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులకు వేతనాలు విడుదల కాకపోవడంతో పండుగకు పస్తులుండే పరిస్థితి దాపురించింది. ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న పార్ట్‌టైం ఉపాధ్యాయులు, అధ్యాపకులు మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

\- చెన్నూర్

జిల్లాలోని సాంఘిక సంక్షేమ ఎస్సీ గురుకుల పాఠశాలల్లో 140మంది ఉపాధ్యాయులు తాత్కాలిక వేతనాలతో విద్యను బోధిస్తున్నారు. వీరికి గతంలో ఒక నెల, రెండు నెలలకు ఒక్కసారి వేతనాలు విడుదలయ్యాయి. బతుకమ్మ, దసరా లాంటి పెద్ద పండగలకు సైతం మూడు నెలల నుంచి వేతనాలు విడుదల కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత గురువారం హైదరాబాద్‌లోని ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి ఓఎస్డీకి పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చి ఐదు రోజులైనా, నేటికీ వేతనాలు ఇవ్వలేదని వాపోతున్నారు.



హైదరాబాద్‌లో మంత్రి ఓఎస్డీకి వినతిపత్రం ఇస్తున్న పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు

వేతనాల్లో వివక్షత..

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ, మైనార్టీ గురుకులు పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పార్ట్‌టైమ్ టీజీటీ ఉపాధ్యాయులకు నెలకు రూ.30వేలు, పీజీటీ ఉపాధ్యాయులకు నెలకు రూ.33 వేలు, జేఎల్‌లకు రూ.36వేలు చెల్లిస్తుండగా ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాలలో పని చేస్తున్న పీజీటీలకు నెలకు రూ.18వేలు, టీజీటీలకు రూ.18,200, జేఎల్‌లకు నెలకు రూ.23వేలు చెల్లిసుంది. ప్రభుత్వం వేతనాల విడుదల్లో వివక్షత చూపడంతో పాటు ఆయా గురుకుల పాఠశాలలకు నెలనెలా వేతనాలు విడుదల చేస్తుండగా ఎస్సీ గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల వేతనాల విడుదలలో జాప్యం చేస్తుందని ఆరోపిస్తున్నారు.

శ్రమ దోపిడీ చేస్తుంది...



ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం ఉపాధ్యాయుల శ్రమను దోపిడీ చేస్తుంది. ఎస్సీ, బీసీ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై వివక్షత చూపుతుంది. మైనార్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి ఒక విధంగా, ఎస్సీ గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు మరో విధంగా వేతనాలు ఇస్తుంది. మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. పండుగలోపు ఇవ్వాలి.

\- మహేశ్ నాయక్, పార్ట్‌టైం జేఎల్, జైపూర్

వేతనాలు ఇవ్వాలి



విద్యార్థుల భవిష్యత్తు కోసం గురుకుల పాఠశాల, కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల, అధ్యాపకుల విషయంలో ప్రభుత్వం చిన్నచూపు చూస్తుంది. మూడు నెలల నుంచి జీతాలు లేక ఇబ్బంది పడుతున్నాం. పండుగకైనా జీతాలు వస్తాయని ఆశపడ్డాం. ఈ నెల 2న దసరా ఉంది. పండగకు ఒక్కరోజు ముందు వేతనాలు విడుదల చేయాలి.

\- కృష్ణవేణి జేఎల్, చెన్నూర్

జోరుగా 'బెల్ట్'దందా!

- పండుగల నేపథ్యంలో విచ్చలవిడిగా అమ్మకాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



బెల్ట్‌షాపు వద్ద మందు కొనుగోలు చేస్తున్న యువకులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలో అక్రమంగా వెలిసిన బెల్ట్‌షాపుల్లో 24గంటలు లిక్కర్ సరఫరా చేస్తున్నారు. విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడంలేదు. బెల్ట్‌షాపుల వద్ద లిక్కర్ కొనుగోలు చేసిన వారు అక్కడే తాగి అసౌకర్యంగా ఉన్న కాలనీల్లోనే మూత్ర విసర్జన చేయడం, రోడ్ల పైనే వాహనాలు నిలపడం, ఆ దారి వెంట వెళ్లే మహిళలపై అసభ్యంగా ప్రవర్తించడం వంటి చర్యల వల్ల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

సింగరేణి కాలనీల్లో...

మార్కెట్ సమీపంలోని మొదటి జోన్, జీఎం ఆఫీస్ సమీపంలో ఉన్నటువంటి బెల్ట్‌షాపుల వల్ల సింగరేణి కార్మిక కుటుంబాలు చాలా ఇబ్బంది పడుతున్నాయి. సింగరేణి కాలనీల్లో బెల్ట్‌షాపుల నిర్వహణ వల్ల కొంతమంది లిక్కర్‌కు అలవాటు పడి విధులకు గైర్హాజరవుతుండగా, మరి కొన్ని కుటుంబాల్లో గొడవలు తలెత్తున్నాయి. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో పడి పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాలని, సింగరేణి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి బెల్ట్ షాపులను కార్మిక కాలనీల్లో లేకుండా చేయాలని, ప్రత్యేకంగా సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలని కార్మిక కుటుంబాలు వేడుకుంటున్నాయి. ఈ విషయమై బెల్లంపల్లి ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్‌కు కాల్ చేయగా బెల్ట్‌షాపులపై ప్రత్యేక దాడులు చేసి కట్టడి చేస్తామన్నారు.

బల్దియా ఆఫీసు ఎదుట మూగజీవాల తిష్ట

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ రోడ్లపై మూగ జీవాల సంచారం జోరుగా సాగుతోంది. జీవాలు సంచరించకుండా కట్టడి చేయడంలో మున్సిపల్ అధికారులు కనీస పట్టింపుకూడా చేయడం లేదు. సింగరేణి ఏరియా ఆసుపత్రి వద్ద నుంచి మొదలుకొని ఏఎంసీ, బీఆర్ అంబేద్కర్ చౌరస్తా, బజారు ఏరియా, పాత బస్టాండ్ ఏరియా మీదుగా కన్నాల బస్తీ వరకు ప్రధాన రహదారి వెంట, మున్సిపల్ కార్యాలయం ముందు పదుల సంఖ్యలో పశువులు రోడ్డుపై తిష్టవేసి ఉంటున్నాయి. రాత్రివేళ జీవాలను ఢీకొని వాహనదారులు గాయాల పాలవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నా మున్సిపల్ అధికారులకు కనీస చలనం లేకుండా పోతోంది. ఇప్పటికైనా రోడ్లపై జీవాలు తిష్ట వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు.



వ్యాధి నిరోధక టీకాలు విధిగా వేయించాలి

బెల్లంపల్లిరూరల్: పెంపుడు జంతువులకు ముందస్తు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శంకర్ అన్నారు. ప్రపంచ రేబీస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పశు వైద్యశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పెంపుడు శునకాలకు రేబీస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ వైద్యాధికారుల సూచనలు పాటిస్తూ జీవాలను సంరక్షించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ఆర్.దిలీప్, సిబ్బంది శ్రావణ్, గోపాల మిత్రలు తిరుపతి,వెంకటేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్ల పశు వైద్య ఉప కేంద్రంలో ఆదివారం ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా పశువైద్య, పశు సంవర్ధక శాఖా ఆధ్వర్యంలో 14పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో హాజీపూర్ మండల పశువైద్యాధికారిణి శాంతిరేఖ, దొనబండ పశువైద్యాధికారిణి హారిక, ముల్కల్ల ఎల్ఎస్ఏ స్రవంతి, పశువైద్య సహాయకురాలు పద్మ, పశు యజమానులు పాల్గొన్నారు.



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న శంకర్

'స్థానిక' ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికై తొలిసారిగా దొనబండ గ్రామానికి వచ్చిన రఘునాథ్‌కు పార్టీ శ్రేణులు భారీ గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీలో చేరగా వారికి రఘునాథ్, వెంకటేశ్వర్‌గౌడ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెద్దంపేట మాజీ సర్పంచ్ పెంద్రెం ప్రేమ్‌సాగర్, దొనబండ మాజీ ఉప సర్పంచ్ పోలాస అనూహ్య, స్థానిక నాయకుడు రంజిత్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పొట్టాల శ్రీనివాసగౌడ్, పలు గ్రామాలకు చెందిన యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజీపూర్ మాజీ వైస్ ఎంపీపీ బేతు రమాదేవి-రవి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు గాజుల ముఖేశ్‌గౌడ్, బొలిశెట్టి అశ్విన్, స్వామిరెడ్డి పాల్గొన్నారు.



కండువా కప్పుతున్న రఘునాథ్, వెంకటేశ్వర్‌గౌడ్

'మన్‌కీ బాత్' వీక్షణ

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని 150వ బూత్‌లో ఆదివారం దేశ ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కి బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. బీజేపి మండల అధ్యక్షుడు బుర్ర రాజశేఖర్‌గౌడ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అక్కెల రమేశ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ర్యాలీ

లక్సెట్టిపేట: ప్రధాని మోదీ ఇటీవల అమలు చేసిన 2.0జీఎస్టీ సంస్కరణల అమలు పై మండలంలోని బీజేపీ నాయకులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. దుకాణాల్లో యజమానులకు జీఎస్టీ గురించి వివరించారు. నూతన జీఎస్టీ ధరలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రఘునాథరావు, హరిగోపాల్, వెంకటేశ్వర్, ముత్తె సత్తయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

భగత్ సింగ్ ఆశయ సాధనకు పాటుపడతాం

బెల్లంపల్లి: స్వాతంత్య్ర సమరయోధుడు, విప్లవ వీర కిశోరం సర్దార్ భగత్‌సింగ్ ఆశయసాధనకు పాటుపడతామని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి వెంకటేశ్ అన్నారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని బజారు ఏరియాలో ఉన్న భగత్‌సింగ్ చిత్రపటానికి ఆదివారం పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఆ పార్టీ శ్రేణులు రమేశ్, రాహుల్, సంజయ్, సునీత్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని రెండో జోన్ పోస్టాఫీస్ వెనుక పాత విజ్ఞాన్ స్కూల్ గ్రౌండ్ ఆవరణలో ఆదివారం మాజీ సైనికుడు రాజేశ్ పిహ్వాల్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో రాణి పిహ్వాల్, హెచ్ రవీందర్, సుందిళ్ల రాజన్న, తిరుపతి, రామిరెడ్డి, వెంకటస్వామి తదితరులు ఉన్నారు. ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అజీమొద్దీన్, రాజ్‌కుమార్, ఆవీద్‌పాష, నాగరాజ్, గణేశ్ ఉన్నారు.



నివాళులు అర్పిస్తున్న నాయకులు





'సద్దుల' సందడి

మంచిర్యాలఅర్బన్/నస్పూర్/మందమర్రి రూరల్: సద్దుల బతుకమ్మ పండగ నేపథ్యంలో జిల్లా కేంద్రం, నస్పూర్, మందమర్రి మార్కెట్లలో సందడి వాతావరణం నెలకొంది. పూల కొనుగోలు కోసం జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. రోడ్లకు ఇరువైపులా తాత్కాలికంగా పూల దుకాణాలు ఏర్పాటు చేశారు. స్థానిక రైతులతో పాటు పెద్దపెల్లి తదితర ప్రాంతాల నుంచి రైతులు పూలు తీసుకొచ్చి విక్రయాలు జరిపారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.



జిల్లా కేంద్రంలో భక్తుల పూజలు



బోనమెత్తుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు



రెబ్బెనలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నస్పూర్: బోనాలతో భక్తులు

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

మంచిర్యాలఅర్బన్/చెన్నూర్/మందమర్రిరూరల్/భీమిని/నస్పూర్/బెల్లంపల్లి: దుర్గామాత శరన్నవరాత్రుల వేడుకలు ఆదివారం కొనసాగాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెల్లంపల్లిలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ మున్సిపాలిటీలోని పలు బస్తీలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. నియోజకవర్గ ప్రజలను సల్లంగా చూడాలని వేడుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే పోశమ్మ గడ్డ వద్ద ఉన్న బతుకమ్మ మైదానాన్ని సందర్శించారు. సద్దుల బతుకమ్మ రోజున మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఏసీపీ ఎ.రవికుమార్, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. భీమినిలో దుర్గామాత మహాచండి అవతారంలో దర్శనమిచ్చారు. మందమర్రిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్, నస్పూర్‌లో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. చెన్నూర్‌లో శ్రీమంజునాథ దుర్గాదేవి మండపంలో మహిళలు కుంకుమార్చన పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని రాళ్లపేట్ రోడ్ నంబర్–1 శివపంచాయితన ఆలయం ప్రాంగణంలో చండీహోమం నిర్వహించారు. రైల్వేస్టేషన్ సమీపంలోని మహంకాళీ టెంపుల్ వాడ మహంకాళీయూత్ దుర్గామండలి (రోట్టెకోలాల వాడ) ఆధ్వర్యంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు కొనసాగాయి.



బెల్లంపల్లి: దుర్గాదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వినోద్

రావణ బ్రహ్మ గ్రంథాలు అందజేత

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో రావణ బ్రహ్మ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులకు ఆదివారం రావణ బ్రహ్మ గ్రంథాలను అందజేశారు. జమ్మికుంటకు చెందిన త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రావణ బ్రహ్మ గొప్పతనాన్ని వివరిస్తూ రచించిన గ్రంథాలను పంపిణీ చేసి మాట్లాడారు. రావణ బ్రహ్మ గొప్ప యోగి అని, అతడి చిత్రపటాన్ని దహనం చేయడం సరికాదని వక్తలు పేర్కొన్నారు. త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి, హిందూ విజ్ఞాన వేదిక సభ్యులు వెంకటాచార్యులు, శశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30న సద్దుల బతుకమ్మ

లక్సెట్టిపేట: మండలంలోని ప్రజలు 30న సద్దుల బతుకమ్మ నిర్వహించుకోవాలని మున్సిపల్ కమిషనర్ విజయ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం ఉన్నతాధికారుల నివేదిక ప్రకారం ప్రతి ఒక్కరూ సద్దుల బతుకమ్మను మంగళవారం నిర్వహించుకోవాలన్నారు.